# ఆత్మీయ బంధం

"అమ్మా ఎత్తుకో—, డాడీ ఎక్కో—." నిద్ర మేల్కొని ఏడుస్తూన్న చంటి పాప స్వరం అలా. పదినిమిషాలైనా అంతకంతకు తారాస్థాయిని జేరుకుంటూన్నదే కాని ఎక్కడా ఆపేటట్టు లేదు. స్టౌ కట్టేసి వంటింట్లోనుంచి విసురుగా బయటకొచ్చింది ఇందిర. పాప ఏడుపు మినహా ఎక్కడా మనుష్యుల అలికిడే లేదు. కోపంగా పెరటివైపు నడచిన ఆమె ఆగ్రహంతో కొన్ని క్షణాలు మాట్లాడలేకపోయింది. అక్కడ మూడేళ్ళ గోపీ ఎవరూ లేనట్టుగా మొక్కలకు నీళ్ళు వెళ్తూన్న కాలువలోని బుఱదనంతనూ తీసి తలనుంచి పాదాలవఱకూ శుభ్రంగా పులుముకుంటున్నాడు. ఆ పసివాడిని వాడి మానాన వాడిని వదలి కొండయ్య హాయిగా మామిడిచెట్టు మ్రానుకు జేరగిలబడి కూర్చుని చుట్టకాలుస్తూ గిన్నెలు తోముతూన్న పైడమ్మతో కబుర్లు చెప్తున్నాడు.

వాడు చెప్తున్న కబుర్లకు పరవశించిపోతూ గిన్నెలు తోమడం ఆపుజేసి ఆ మసిచెయ్యే బుగ్గకు ఆనించుకుని

"ఆహా, అట్టాగా? ఎట్టెట్టా?" అంటూ మధ్య మధ్యన చిన్నచిన్న ప్రశ్నలువేసి తన సందేహాలు తీర్చుకుంటోంది పైడమ్మ.

బుఱద పులుముకోవటం ఆపి గోపీ చిన్న మొక్కల పువ్వులనూ, మొగ్గలనూ సవరించడం మొదలుపెట్టాడు.

మరి కోపం నిగ్రహించుకోలేక పోయింది ఇందిర.

మాట్లాడకుండా వెళ్ళి గోపీని బఱబఱా కుళాయిదగ్గ ఱకు ఈడ్చుకువెళ్ళి ఆ బట్టలుతీసి పారేసి కోపంగా చన్నీళ్ళ తోటే తలస్నానం చేయించసాగింది. కొండయ్య కాలుస్తూన్న చుట్టను చెట్టు మొదట్లో దాచి ఖంగారుపడ్తూ వచ్చాడు. పైడమ్మ ఏమీ ఎరగనట్లు తలవంచుకు గిన్నెలు తోముకోసాగింది.

"నేను చేయింతాను లెండమ్మగారు స్నానం," బెదురుతూనే నసిగాడు కొండయ్య.

కోపంగా తలెత్తింది ఇందిర. "ఇంతవరకూ ఎక్కడ చచ్చావ్?"

కొండయ్య తల వంచుకున్నాడు.

"తెలిసీ తెలియని బిడ్డను అలా మురికిలో వదిలేసి, మహారాజులాగ చుట్టకాలుస్తూ కూర్చున్నావ్ కదూ అక్కడ? నీ ఏడుపేదో నువ్వేడవక పైగా దాన్నికూడా గిన్నెలు

తోమనీయకుండా కూర్చోబెట్టావా? కూనేగాడిదా, మేసే గాడిదా అన్నట్టుగా వుంది."

"పొరపాటైపోయిందమ్మగారూ."

"ఏడిశావ్ దున్నపోతా." ఇందిర కోపం తగ్గటం లేదు. "పనులు మాని సోమరిగా కూర్చోవడం, పొరపాటై పోయిందనడం.అసలు పొరపాటు కానిరోజూ,నాచేత మాట్లా డించని రోజూ వుందట్రా నీకు?"

కొండయ్య తలెత్తలేదు; మాట్లాడ లేదు.

"నువ్వున్నావ్ కదా పిల్లల్ని చూస్తావని వదిలేసి నేను వంటింట్లో పనిచేసుకుంటూంటే నువ్వు వాళ్ళ ఖర్మానికి వాళ్ళని వదిలేసి దర్జాగా కూర్చుంటున్నావ్. ఇక్కడ బాబు మట్టి పులుముకుంటూంటే గ్రుడ్డివాడిలా కూర్చున్నావ్? అక్కడ పాప గంటనుంచి ఏడుస్తూంటే చెవులలో చెట్లు మొలచినట్లుగా నీ కసలు విన్పించటమే లేదు... 'మమ్మ ల్నెందు కింతంత జీతభత్యాలిచ్చి భరిస్తున్నార'నే ఇంగితం వుండాలేకాని మనిషిజన్మ ఎత్తినందుకు, ఎన్నని చెప్పటం? కూర్చుని తిందాం, పనులు తప్పించుకుందాం అనే పాడుబుద్ధి వుంటే పనికిరారు మనుషులు." అంటూనే గోపీని తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది, కొండయ్యకు పని చెప్పటానికే అసహ్యపడ్తూన్నట్టుగా.

ఏడుస్తూన్న పాపను ఎత్తుకొని తీసుకొచ్చి దొడ్లో త్రిప్పసాగాడు కొండయ్య. ఎవరో ఒకరు ఎత్తుకోవడంతో పాప ఏడుపు మానింది.

తోమి కడిగిన గిన్నెలను లోపలికి చేరవేస్తూన్న పైడమ్మతో దొంగచూపులుచూస్తూ, "అమ్మగా రెక్కడుంది?" అనడిగాడు గుసగుసలుపోతూ.

"ఎక్కడో లోపల వుందిలే, ఇక్కడ లేదు" అని అర్థం వచ్చేలా సైగలు చేసింది పైడి.

కొండయ్యకు తిరిగి ధైర్యం చిక్కింది. "చూశావటే పైడీ ఎన్ని మాటలన్నదో అమ్మగారు? పిల్లలన్నాక మట్టిలో ఆడకుండా వుంటారా? ఎంత తిండిపెట్టి జీతమిత్తే మాత్రం మాటిమాటికీ అంత తాడెత్తున లేవాలా? ఇక సూస్కో, ఇయ్యాలంతా ఆమెగారి కోపం అట్లాగే వుంటది. మనకి బాజా బజంత్రీలే సాయంతరందాకా."

పైడి ముసిముసి నవ్వులు నవ్వి వూరుకున్నది.

కొండ తిరిగి మొదలుపెట్టాడు చుట్టూరా ఓసారి కలయజూచి. "అది కాదే పైడీ. కలిగున్న మారాజులు కనుక ఆరి పిల్లలకు అంత గారాబం. ఏడిస్తే అరిగిపోతారు; మట్టిలో ఆడితే ఆరోగ్యాలు పాడౌతాయి? మరి మన పిల్లలు? పొట్టకూటికోసం మనం యిలా పనుల్లోకి వత్తే

అక్కడ యింటికాడ మన పిల్లలు మట్టిలో దొల్లుతున్నారో ఏడుత్తున్నారో సత్తన్నారో ఎవడు చూడొచ్చాడనే ?"

"అంతేలే కొండా" ఏడుపు స్వరంతో అంగీకరించింది పైడి, ఇంటి దగ్గర వదలిన రెండేళ్ళ బిడ్డను తలచుకుంటూ.

శ్రోత తన అభిప్రాయంతో అంగీకరించటంతో కొండయ్యకింకా క్రొత్త ధైర్యమూ, కొంగ్రొత్త భావ పరంపరలు రాసాగాయి. "ఆళ్ళనైతే పాలుతాగే పసిపాపనీ, బొడ్డూడనోడినీకూడ అమ్మాయిగారూ, అబ్బాయిగారూ, అమ్మగారూ, అయ్యగోరూ అనాలా మనం? మనలైనతే మీసాలు నెరిసినోడినీ, ఏళ్ళు గడచినదాన్నికూడా కొండా, పైడీ, సుబ్బిగా, ఎంకిగా, ఒరేయ్, అసేయ్ అనొచ్చు ఆళ్ళు. ఛీ, ఏం నాయమే యిది పైడీ?" తుపుక్కున ఊశాడు.

"పోన్లే మావా" లెక్కలేనట్లుగా అన్నది పైడి. "పెట్టినా ఆరే, తిట్టినా ఆరే గందా. దారినపోయేవోల్లెవరూ మనకు ఎట్టనూ ఎట్టరూ, తిట్టనూ తిట్టరు. ఏదో పెద్దోరు ఓ మాటంటే మనం పడగూడదా ఏంటి? అయినా మన పని మనం బాగా సేసుకుంటూపోతే ఆరు మాత్రం ఎందుకంటార్లే, నోరు గాని కొవ్వింందా?"

"పోయేఁ నీదంతా సత్తిగాలం." పైడి మాటలు రుచించలేనట్లుగా తీసిపారేశాడు కొండ.

## 2

"వదినా!!" కాలేజీనుంచి వస్తూనే మరిది చంద్రం పెట్టిన గావుకేకకు అదరిపడ్తూ వచ్చింది? ఇందిర లోపల్నుంచి.

పాపను ఎత్తుకుని వున్నాడు చంద్రం. కందగడ్డలాగైన ముఖంతో వగరుస్తూ.

"ఏమిటి చంద్రం? ఏమిటది అలా వగరుస్తున్నావ్. పాప నీ దగ్గర కెలావచ్చింది? కొండయ్య ఏడీ?" ఆత్రతగా ప్రశ్నలవర్షం కురిపిస్తూ అతడి దగ్గరున్న పాపను అందుకున్నది ఇందిర.

గుండెలు సవరించుకుంటూ కుర్చీలో కూలబడ్డాడు చంద్రం. "అదృష్టవశాత్తు నేను టైముకువస్తూ చూడబట్టిగాని మరోక్షణముంటే పాప మెయిన్ రోడ్డుమీద దేనిక్రిందనో పడివుండేది?"

"అమ్మయ్యో!" అదిరిపోయింది ఇందిర. "ఎంత గండం తప్పిందే నా తల్లీ. ఆ దేవుడు మనయం దున్నాడు." అంటూ బిడ్డను గుండెకు హత్తుకుంది ఇందిర.

చంద్రం తమాయించుకోలేని కోపంతో అన్నాడు. "పిల్లలు యింట్లోపడి ఎంత ఏడ్చినా ఫరవాలేదు కాని ఆ బాధ్యతలేని నౌకర్లకిస్తే మొదటికే ముప్పు వదినా. పాపను

అలా వదిలేసి వాడు ప్రక్కింటివాళ్ళ డ్రైవర్‌తో చెట్టు క్రింద పులిజూదంలో మునిగిపోయాడు. ఈ ఏడాది పసిదాని కేం తెలుసు? నచ్చిన దారిన నడుస్తోంది బాటకు అడ్డ బడి."

అంతలోనే కొండయ్య రానేవచ్చాడు చేతులు నలుపుకుంటూ. "పొరపాటైంది అమ్మగారూ. ఏదో ఒక్క రెండు నిముషాలు ఏమారిఉన్నంతలో అమ్మాయిగారు అలా నా కన్నుగప్పి పారిపోనారు."

"ఛీ నోర్ముయ్యరా. వాళ్ళేమైనా పసిపిల్ల లను కున్నావా, మరో టనుకున్నావురా గాడిదా? మరోసారిలా చేస్తే, అన్నయ్యతో చెప్పి నిన్ను పీకిపారేయించడం మాత్రం ఖాయం." కోపంలోవున్న చంద్రం భోజనం చేయకుండానే వెళ్ళిపోయాడు తిరిగి కాలేజీకి.

## 3

సాయంత్రం పిల్లల్ని షికారు తీసుకువెళ్ళటానికి పెరాంబులేటర్ సిద్ధం చేస్తున్నాడు కొండయ్య!

ఇందిర వారించింది. "ఒరేయ్ కొండా! నీకు జాగ్రత్త తక్కువ, వాళ్ళా నోరులేని పసిపిల్లలు. షికార్లూ వద్దు పార్కులూ వద్దుకాని యింట్లోనే ఆడించు."

నవ్వేశాడు కొండయ్య. "ఊరుకోండమ్మగారూ, ఏదో బుద్ధితక్కువపని అత్తమానూ సేత్తానేంటి? అలా పార్కుదాకా తీసికెల్లి ఆడించుకొత్తాను."

"వద్దులేరా, వెధవపనులు చేయటం, పొరపాటై పోయిందనటం-నీకు మామూలైపోయింది. ఏదైనా జరిగితే, ఇక నిన్ను ఎన్ని అనిమాత్రం ప్రయోజనమేమిటి? ఎక్కడికీ తీసుకెళ్ళద్దు. మన కాంపౌండులోనే ఆడించు."

మాటలు వచ్చీరాని బాబు గొడవ మొదలు పెట్టాడు. "అమ్మా పార్కు, అమ్మా షికాచ్చి, తొండా బజాచ్చి."

నవ్వొచ్చింది ఇందిరకి. "తొండ కాదురా, కొండ!" అని కొడుక్కిచెప్తూ కొండయ్యతో అన్నది: "సరే, నేను వద్దంటే ఈ పసిమూర్ఖులు ఊరుకుంటారా? పార్కులూ బజార్లూ వద్దుకాని మన కాంపౌండులోనూ, మన వీధిలోనే తిప్పు."

"చిత్తం."

"ఏం కొండా, ఇయ్యాల పార్కుకి రావటంలేదా?" పిల్లల్ని కాంపౌండులోనే త్రిప్పుతూన్న కొండయ్యను, చూచి ఎదురింటి పిల్లల్ని పార్కుకు తీసుకు వెళ్తూన్న ఆయా అడిగింది.

"లేదులే మరియమ్మా, నువ్వెల్లు" అన్నాడు కొండయ్య, తలగోక్కుంటూ. మరియమ్మ వెళ్ళిపోయింది.

ఓ పది నిమిషాలు పోయేసరికి ఇటు ప్రక్కయింటి నౌకరు రాముడూ, అవతల యింటి నౌకరు వెంకయ్యా వచ్చారు.

వెంకయ్య గేటులోంచి ముఖం లోపలికి పెట్టి, "ఏరోయ్ గురూ! ఇంకా లోపల్లోపలే తచ్చాడతన్నావ్? మనపార్కు పైమైపోనాది!" అన్నాడు.

కొండ అటూయిటూ చూచి, అమ్మగారు ఆ పరిస రాల్లో లేరని రూఢి చేసుకున్నాక గేటు దగ్గరకు వెళ్ళి నెమ్మ దిగా అన్నాడు, "ఇయ్యాలనుంచి పిల్లల్ని బయటికి తీసుకెల్ల టానికి పర్మిషన్ లేదని అమ్మగారు ఖచ్చితంగా చెప్పేసి నాది ఇంతకుముందే. మద్దినాల సిన్నబాబు సెంద్రంకూడ శానాకోపం చ్చేశాడు."

రాముడి కనుబొమలు ఆత్రంగా పైకి కదిలాయి. "ఏరోయ్, ఏటేటి అసలు గడబిడ? అచ్చింతలు బాగా పడ్డాయా?"

"ఏటో లేరా. ఇయ్యాల లేచిన పొద్దెలాటిదోగాని, పొద్దుటమాలినుంచి ఏక బిగిని ఒకటే తిట్లుతింటన్నాను. సరి మీా రెల్లండి పార్కుకి. మల్లీ అమ్మగారు సూస్తే, పిల్లల్నొది

లేసి వూసులాడుతున్నవని కోపం సేస్తది;" అంటూ వెను దిరిగాడు.

"ఒరి పిచ్చోడ రారా." తేలికగా తీసేస్తూ అన్నాడు రాముడు. "ఆళ్ళ కోపాలకేటి, తాటాకు సప్పుళ్లు. అంతే. కాస్సేపు ధాంధూం అంటారు. ఆళ్ళనోరే కన్పిస్తాది, మనకేం రా."

ఆలోచనలో పడ్డాడు కొండయ్య.

వెంకయ్యకూడా రాముడిలాగే భరోసా పలికాడు కొండయ్యకి. "రారా అమ్మగారు సూ త్తదేటి నువ్వు పార్కు-కెల్లావో లేదో. లోపల ఏదోపనిలో మునిగివుంటాది. ఇదే మన్నా పాతకాలమా ఏటి రేత్రనక పగలనక బండ సాకి రీలు సేయడానికి? అంతగా అడిగితే అలా పక్కి-దివరకూ తీసికెల్లానని సెప్పువుగాని. రా."

"అవును. నడవంట్రా."

పిల్లల్ని బళ్ళల్లో కూర్చోబెట్టి త్రోసుకుంటూ బయల్దేరింది నౌకర్ల బృందమంతా, ఎవరు పనిచేస్తూన్న యింట్లో జరిగిన విశేషాలు వాళ్ళు కట్టుకథల్లా చెప్పుకుంటూ, శ్రోతలకు శ్రవణానందకరం చేస్తూ.

పార్కు- దగ్గరకు జేరీ జేర్తూండగానే వారిని కొందరు పనిపాటలు చేసుకునే వారి పిల్లలు చుట్టుముట్టారు. "రండి

రండి" అంటూ వాళ్ళను కొండంత సంబరంతో ఆహ్వానిస్తూ, తాము తీసుకొచ్చిన పిల్లలను వారివారి తోపుడు బళ్ళనుండి క్రిందికి దించి పార్కులోని పచ్చికబయళ్ళమీద వదిలేశారు. "కొంచెంసేపు ఇక్కడాడుకోండి మీరు" అని. పచ్చికపై పరుగు లెత్తేవారు పరుగులు పెడ్తున్నారు; తమలో తాము ఆడుకునేవారు ఆడుకుంటున్నారు; కొట్టుకునేవారు కొట్టుకుంటున్నారు. అలా ఆ పసివాళ్ళను వాళ్ళ ఖర్మానికి వదిలేసి, రాముడూ వెంకన్నా తమచుట్టూ మూగిన పిల్లలను బండ్లలో ఎక్కించి పదేసినిమిషాలు త్రిప్పి తలకో అయిదు పైసలు వసూలు చేసుకొంటున్నారు. కొండయ్యా తన స్వంత సంతానం రాగా వారికే ఒప్పజెప్పేశాడు తాను తెచ్చిన బండి. ప్రక్కవీధిలో మరో యింట్లో పనిజేసే దాలయ్యా వచ్చి, చెట్టు క్రింద చేరగిలబడ్డ కొండయ్యతో ఇష్టాగోష్టి ప్రారంభించాడు.

"ఓరి కొండయ్యా మావా. ఏట్రా యిదంతా? తప్పు కాదూ?"

"ఏట్రా? ఏటా తప్పు?" ఏమీ ఎరగనట్లు ప్రశ్నించాడు, కొండయ్యా.

"ఏముందిరా? మీరు చేస్తున్న ఈ పనులే. యజమానులు చూస్తే ప్రమాదం కాదంటారా? ఆరి పిల్లల్ని అలాగ

మట్టిలో వదిలేయటం, ఈ దారినపోయే పిల్లల్ని ఆరి బళ్ళు ఎక్కించటం, మీారు డబ్బులు నేసుకోవటం — ఏం పనుల్లా యియ్యి కొండా?"

"ఆ పోరా అమాయకుడా?" తేలికగా తోసి పారేశాడు. తేలికగా చుట్ట వెలిగించి, తన అమూల్యాభిప్రాయాలను సెలవియ్యడం ప్రారంభించాడు. "సూడ్రా దాలయ్యా. ఇది నాయానికి కాలంకాదు. సత్తిగాలంగా వుంటే రోజులెల్లవ్. సూడు మన అయ్యగార్లందరికీ పెద్దకార్లున్నాయా? ఆరికొచ్చే జీతాలతో సత్తెంగా వుంటే ఆరి రోజు లెల్తాయా? అంత దర్జాగా బ్రతగ్గలరా? ఆరి ఆఫీసు కార్లలో పెళ్ళాం బిడ్డల్ని దర్జాగా తిప్పడంలేదూ? అవసరాలుండి వచ్చినోళ్ళదగ్గర పదీ, పాతికా వసూలు చేసుకోవడంలేదూ? అలాగే మనమూ ననుకో? మన ఈ కూలిడబ్బులతో పిల్లల్నెలాగా ముచ్చటగా బళ్ళల్లో కార్లల్లో త్రిప్పలేంగందా. అందుకే ఈ సాయంత్రం యేళల్లో ఓ గంటైనా ఆరి కన్నుగప్పి మనపిల్లల ముచ్చట తీర్చుకోపోతే ఎలాగ? మన సరదాలు తీరే దెప్పుడు?"

అతడితో అంగీకరించలేనట్లుగా దాలయ్య తల అడ్డంగా త్రిప్పాడు. "కాదురా, నేను ఒప్పుకోను. అసలు మనం న్యాయంగా వున్న దేదీ. న్యాయానికి రోజుల్లే

వనుకో టానికి? ను వ్వెన్ని చెప్పు. తప్పు తప్పే. మంచి మంచే."

అంతలో మరో పరిచితుడు ప్రవేశించాడు వారి సభలోకి.

"ఏరో ఎంకటయ్యా. ఈ మద్దిన కనపడ్డం మానేశావ్. ఏం టలా తీసిపోనావ్. బొత్తిగా బికారోడినాగా తయారైనావ్. జబ్బుగానీ చేసిందేరా?"

"జబ్బు లేదురా... నా ఖర్మకాలిపోయింది." ఉస్సురంటూ కూలబడ్డాడు వెంకటయ్య. "ముందో బీడీ పీక యిలా పారేయరా బాబూ. ప్రొద్దుట్నుంచీ గుక్కెడు టీ నీళ్ళుకూడా లేకుండా తిరుగుతున్నాను."

"ఏరా సంగతేటి? పన్లో కెళ్ళడంలేదా నువ్వు?" బీడీ యిస్తూ కొండయ్యా, దాలయ్యా సానుభూతితో అడిగారు వెంకటయ్యను.

"ఏటి సెప్పనురా నా పాట్లు?" కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. "మా అయ్యగారి పనే ఊడిపోయింది ఆఫీసులో. ఇక నాను పన్లో కేమెల్లను?"

"ఎట్టెట్టా?" నోళ్ళావరించారు శ్రోతలు.

"అవున్రా. మీ అయ్యగారు పెద్ద ఇంజనీరు కదూ?" దాలయ్య అడిగాడు.

"అవుననుకో, ఏటినాభం? సంపాదించినన్నాళ్ళు బాగానే సంపాదించినారు రెండు సేతులా. ఇన్నాలకి ఆయన బతుకు బయటపడ్డది. "నువ్వు గవర్నమెంటోరి కార్లు అన్నా యంగా వాడుకున్నావ్. కంట్రాక్టర్ల దగ్గర లచ్చలకి లచ్చలు డబ్బు గుంజావ్. లేకపోతే నీకింత డబ్బెక్కడిది బ్యాంకిలో. మే డెలాగ కట్టావ్. కొడుకునీ, అల్లుణ్ణీ అమిరికా దేశం ఎలా పంపావ్? నీ యింట్లో ఈ రిప్రిజిరేట రేటీ—"

"అదేటిరా రిప్రేజీ అంటే?" కొండయ్య అడిగాడు.

"అయిసు పెట్టెరా. పెద్ద అయిసు పెట్టె. కరెంటు మీద పనిజేత్తదిలే అది. అందులో పాలు, కూరలు, గుడ్లూ సమస్తం సెడిపోకుండా వుంటాయి కొన్నాళ్ళు."

"సర్లే. అసలు సంగతి పూర్తిగా జెప్పు."

"ఆఁ. అలా అడిగారా నీ యింటో ఇదెక్కడిది అదెక్కడిది? ఇన్ని రకాల రేడియోలేటి? ఇంతింత వెండి బంగారా లెక్కడియ్యి? నీ పెళ్ళాని కిన్ని రవ్వల నగలు ఎలా జేయించేవ్?' ఇలాగేరా కొండా ఒకటేటి అన్నీ పట్టుకుపోనారు."

"ఓర్నీ." కొండయ్య వులికిపాటుతో లేచి కూర్చు న్నాడు. "పట్టుకుపోయారంట్రా ఎంకటయ్యా అన్నీ?"

"ఆ పట్టుకుపోనారు. కోర్టులో అయ్యగారిమీద కేసు

బనాయించినారు. ఉద్దోగం తీసేసినారు. 'ఏం జేత్తాం, మా రోజులు బాగులేదురా. ఇక మిమ్మల్ని భరించలేం' అంటూ అమ్మగారు మమ్మల్నందర్నీ తీసేసింది పన్లోంచి."

"ఆళ్ళకేంలే సదువున్నోళ్ళు, ఎట్టయినా బాగుంటారు గాని. మరి నీకింకా ఏ నౌకరీ దొరికేట్టు లేదంట్రా ?"

"ఏడ దొరుకుద్దిరా! పెద్దపెద్ద ఇంజినీర్లు, డాకటేర్లకే గతి నేకుండా వుందట యిప్పుడు. ఎక్కడా నౌఖరీ ల్లేవట. ఇక నాలాటి కూలోడికా దొరికేది. నిన్నరాత్రిదాకా ఎట్టనో గడిసింది. ఈ పొద్దు అప్పుకూడ పుట్టనేదు. పిల్లల్తోగూడా పస్తే. ఎక్కే గుమ్మం, దిగేగుమ్మం నాపని. ఎక్కడన్నా ఏ పడవల రేవులోనో ఏ బజార్లోనో మూటలు మోసి బతుకుదావన్నా అక్కడ జట్టుకూలీలు పైగా వచ్చిన కొత్తోళ్ళని జేరనీరు. ఏ యింటోను ఖాళీ లేదన్నారు. ఒకరిద్దరు నౌఖర్లు అవసరమైనా సరే – 'నీ పాదం మంచిది కాదు. ఆ యిల్లు తుడిచినటే మమ్మల్నీ తుడుస్తావ్' అన్నట్టుగా మాట్లాడార్రా."

"ఓరి బాబోయ్" పురాణం వింటూ‌న్నట్టు వింటూ హాయిగా కూర్చున్న కొండయ్యా ఒక్కసారి వులిక్కిపడి, బెదరి ఒక చెట్టుచాటుకు తప్పుకున్నాడు.

అందరూ ఏమిటా అని చుట్టూ చూస్తూండగానే,

అతడి యజమాని మరో నలుగురు సహోద్యోగులతో వారి ముందునుంచే సాగిపోయాడు.

"మీ అయ్యగారు కదురా?" గుసగుసలాడారు అందరూ.

"మరేను, షికారుగా వచ్చినట్టున్నారు," అంటూ అప్పుడు పిల్లలెక్కడున్నారో వెతకసాగాడు కొండయ్య గుర్తుకు వచ్చి.

మొక్కలకు నీరు పెడుతూన్న గొట్టంతో ఆడుతూ శుభ్రంగా తడిసి ముద్దలై వున్నారు పిల్లలు చాలామంది. వారిలోనే గోపీ పాపాకూడా వున్నారు. ఒక్కసారిగా కొండయ్యకు గుండె ఆగినట్లయింది. అలాగే వూపిరి బిగ పట్టి చూస్తూ 'అమ్మయ్య! చూడలేదు, అయ్యగారు దాటి పోయారు.' అనుకుంటూండగానే పిల్లల బృందంలోనుంచి, "డాడీ, డాడీ" అంటూ గోపీ పరుగెత్తడం, తండ్రిని పట్టు కుని దుస్తులకు బురద అంటించడం జరిగిపోయింది. గోపీని చూస్తూ, పాపకోసం, కొండయ్యకోసం వెతికాయి ఆ తండ్రి కళ్ళు.

"అరరే అదేమిటలా తడిసిపోయారు?" అంటూ అతడి తోటివారి ప్రశ్నలు. "ఎవరు తీసుకొచ్చారు బాబూ మిమ్మల్నిక్కడికి?"

"ఇప్పుడే బాబూ అలా వెళ్లాను. రెండు నిముషాలు కూడ అవ్వలేదు." ఆదరా బాదరా పరుగునవచ్చి అన్నాడు కొండయ్య.

అతడి యజమాని ఏమీ అనలేదు. "చీకటి కావస్తూన్నది. ఇంకా ఎందుకు? పిల్లలు నాతో కార్లో వస్తారు. బండి తీసుకురా నువ్వు." అంటూనే పాపను ఎత్తుకుని, గోపీని నడిపించుకుంటూ వెళ్ళిపోయారు.

కొండయ్య నీళ్ళుగారిపోయాడు. ఏ అబద్ధం చెప్పి తప్పించుకోలేని పరిస్థితి అది. అలాగే మౌనంగా కారు వరకూ యజమానిని అనుసరించి, కారు సాగిపోయిన తర్వాత మెల్లగా బండి తోసుకుంటూ బయల్దేరాడు. అతడి మెదడులో ఎన్నో ఆలోచనలు!

'ఇంటి కెళ్ళగానే అయ్యగారు తిడ్తారు; అమ్మగారూ తిడ్తారు. నిజంగా నేను చేసినది ఎదవపనే. బండిలో నా పిల్లలు కూర్చోనుండడంకూడా సూసేవుంటా రయ్యగారు. ఛ. ఇంకెప్పుడూ ఇలా చేయకూడదు.' అనుకున్నాడు జీవితంలో ప్రప్రథమంగా.

దాలయ్య హితబోధా, వెంకటయ్యగతీ, వెంకటయ్య యజమాని అనుభవకథా తలపుకు వచ్చాయి. "నిజమే తప్పు ఎప్పుడో ఒకప్పుడు బయటపడకపోదు. పాపం బ్రద్ద

లవ్వక మానదు. ఒక్కనాటి వెలుగుకోసం, ఒక్కఘడియ గొప్పకోసం, బ్రతుకంతా చీకటిచేసే ఈ తప్పుమార్గాల్లో నడవకూడదు. న్యాయంగా, మనస్సుకు హాయిగా, శాంతంగా వుండేట్లు బ్రతకాలి వున్నదాంట్లో. వెంకటయ్య యజమాని సంపాదనలాగా, చాటుమాటుగా చేసే నాగడన కూడా ఎగిరిపోతుందా ?"

చుట్టూ చీకట్లు క్రమ్ముకుంటున్నాయి. గూళ్లుజేరిన పక్షుల రెక్కల తటతటలు వినవస్తున్నాయి వృక్షోపరి భాగాలనుండి. దారితప్పిన ఒక పక్షి యింకా ఆకసంలో అటుయిటు తిరుగుతూ దీనంగా కాకా అంటూన్నది. వెంక టయ్యకూడా ఆ పక్షిలాగే తిరుగుతూన్నట్లు అన్పించింది కొండయ్య మనస్సుకు. 'ఇన్ని పచ్చటి చెట్లున్నాయి. అయినా కన్పించిన చెట్టుమీద అది వాలలేదు. దాని కాశ్రయంగా వున్న వృక్షమేదో ! ఏ చెట్టు నీడన బ్రతుకుతున్నదో ఆ చెట్టుకూ ఈ పక్షికీ ఏమి అనుబంధమో ! ఆ వృక్షంపై దానికెంత ప్రేమో ! అవును. పచ్చనిచెట్టు పక్షుల కాశ్రయమిస్తుంది. పచ్చగా బ్రతుకుతూన్న మనిషి పదిమందికి ఆశ్రయ మీయగలడు. చెట్టుపచ్చనపోతే పిట్టలు వలసపోవాలి; మనిషిపచ్చన మాయమైతే ఆశ్రితులు తలో దారీ పట్టిపోవాలి.' నిలువెల్లా కంపించిపోయాడు కొండయ్య.

'అవును. పక్షికీ చెట్టుకూ వున్న సంబంధం లాంటిదే తనకూ యజమానికీ వున్న సంబంధం. యజమాని జీవితం పచ్చగా బాగుంటేనే తనకు మనుగడ బాగుంటుంది. అదృష్ట వశాత్తూ తన యజమాని మంచివాడే. అన్యాయవర్తనుడు కాడు. ఎప్పుడు ఎండిపోతుందో తెలియని చెట్టులాగా ఎప్పుడు ఎగిరిపోతుందో తెలియని ఐశ్వర్యం కాదతడిది. క్రిందివారిని అనవసరంగా బాధపెట్టే స్వభావంకాదు. దయా కనికరాలు గల మనసు. విశ్వాసంగా, అతడి కోపానికి గురికాకుండా పని చేసుకుపోతే అతడి నీడన తానూ తనవారూ పదికాలాల పాటు చల్లగా బ్రతకవచ్చు. అతడూ, అతడి భార్యా మంచి వారు గనుకనే పనిలో ప్రవేశించిన దాదిగా తాను ఎన్ని తప్పుపనులు చేసినా ఎంత బాధ్యతారహితంగా ప్రవర్తించినా అలా కేక లేసి వూరుకుంటున్నారు. ఇంకెన్నడూ వారికి కోపం తెప్పించకూడదు. విశ్వాసంగా పనిచేయాలి. యజమానినీ, యజమాని ఐశ్వర్యాన్నీ బిడ్డలనూ ద్వేషించకూడదు. నాకు దేవుడు మేలు చేస్తాడు.'

బండి లోపలిగదిలో వుంచి తక్కుతూ తారుతూ వెళ్ళాడు కొండయ్య దొడ్డివేపు. పిల్లల మురికిబట్టలు ఒక మూల పడివున్నాయి. స్నానం చేయించి అప్పుడే మంచి బట్టలు వేయిస్తున్నది అమ్మగారు. అయ్యగారు చూస్తూ

నిల్చున్నారు పిల్లలు బురదపులిమిన బట్టలు యింకా విప్ప కుండానే.

కొండయ్యను చూడనట్టే, పిల్లల్ని తీసుకుని అమ్మగారు లోపలికి వెళ్ళిపోయింది. అయ్యగారు ఒక్కసారి అతడిని చూచారు. జేబులోనుంచి పర్సుతీసి అయిదుపదులు లెక్క పెట్టి ఇచ్చారు. "ఇకమీదట పిల్లల్ని నౌకర్లకు ఒప్ప జెప్ప రాదని నిర్ణయించుకున్నాం కొండయ్యా! ఇదిగో పూర్తిగా నీజీతం. వేరే యిల్లు చూసుకో." అంటూనే లోపలికి వెళ్ళి పోయారు!